ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు

రక్త పరీక్షల పేరుతో దోపిడీ..!

ఒక్కో టెస్టుకు రూ. 500 నుంచి 2వేల రూపాయల వరకు వసూలు

నామమాత్రంగా అధికారుల తనిఖీలు

ప్రజల జేబుకు చిల్లు

జిల్లాలో విద్య, వైద్యం రెండూ రోడ్డున పడ్డాయి. జిల్లా అధికార యంత్రాంగం అదుపాజ్ఞలు తప్పి జనంపై స్వారీ చేస్తున్నాయి. ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి తప్పని సరిగా కల్పించాల్సిన ప్రాధాన్యతాంశాల్లో విద్య, వైద్యం అత్యంత ముఖ్యమైనవి. విద్య ద్వారా అక్షరాస్యత పెరిగి మానవ వనరులు వృద్ధి చెందుతాయి. వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుంది. ప్రభుత్వం ఈ రెండింటినీ నిర్లక్ష్యం చేసిన ఫలితంగా క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా రక్తపరీక్షల పేరుతో దోపిడీ జరుగుతోంది. ప్రస్తుత జ్వరాల సీజన్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు దోపిడీకి తెరతీసి వారిని నచ్చినట్లు పీల్చి పిప్పి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఖంగు తినే హంగులతో నామ కరణాలున్న ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు తల్లిదండ్రుల బలహీనతలే ఆసరాగా వారి జేబులు గుల్ల చేస్తున్నాయి. మరో వైపు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేసిన ప్రయివేటు ఆసుపత్రులు కనీసం రోగుల నాడి అయినా పట్టకుండా ఎడాపెడా దోచేస్తున్నాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా దాదాపు 250కు పైగా ప్రయివేటు ఆసుపత్రులు ఉండగా అందులో వందకు పైచిలుకు ఆసుపత్రులు అనంతపురం జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఇక హిందూపురంలో దాదాపు 40దాకా ఉన్నాయి. వీటిలో అధికశాతం ఆసుపత్రులు చిన్నపాటి సమస్యతో వెళ్లినా స్కానింగ్‌లు, రక్త పరీక్షలు అంటూ హడావుడి చేసి స్కానింగ్ సెంటర్ల పర్సంటేజీలకు కక్కుర్తి పడుతున్నాయి. కొందరు వైద్యులు కనీసం రోగి నాడి కూడా పట్టి చూడకుండా రిపోర్టుల ఆధారంగానే కుప్పలు తెప్పలుగా మందులు రాసేస్తున్నారు. ఏ అసుపత్రికి అనుమతులు ఉన్నాయో...ఏ అసుపత్రికి అనుమతులేవో ఎవరికి అర్థం కావడం లేదు. వైద్యులు చెప్పిందే వేదం. ఆస్పత్రికి వెళ్లిన రోగిని వివిధ రకాల రక్తపరీక్షలు చేయించుకురావాలంటూ సూచిస్తారు. ల్యాబొరేటరికి వెళ్తే వారు నిలువునా దోచుకుంటున్నారు. జిల్లాలో చాలా చోట్ల అనధికారిక రక్త పరీక్షా కేంద్రాలు నడుస్తున్నాయి. అనుమతులు లేక పోయినా అధికారుల సహకారంతో ఆయా కేంద్రాలు సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం నిర్వాహకులు ఆయా ల్యాబ్‌లలో ఆరు నెలలు మాత్రమే పని చేసి ఇతర ప్రాంతాల్లో ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసుకుంటారు. వీరికి ఏ అర్హత ఉండదు. చాలా చోట్ల సహాయకులుగా చేరేవారే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక ప్రయివేటు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో టెక్నీషియన్లకు సరైన అర్హత లేకపోయినా వైద్యులు వారి వద్దనే రక్తపరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణ రక్త పరీక్షలు చేయాలంటే డిఎంఎల్‌టి, డిఎస్‌బిఎంఎల్‌టి, ఎంఎస్‌డిఎల్‌టి పూర్తి చేయాలి. చాలా మందికి అర్హత లేకపోయినా ప్రయివేటు కేంద్రాల్లో పని చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ఆయా పరీక్షలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇలాంటి సూచిక బోర్డులు ఎక్కడా కనిపించవు. అలాంటి ల్యాబ్‌లలో రక్తపరీక్షలు చేయించుకుని తప్పుడు ఫలితాలు రావడం వల్ల తమకేదో రోగం ఉందని కొందరు కుంగిపోతున్నారు. అదే మరో కేంద్రంలో పరీక్ష చేయించుకుంటే ఎలాంటి ఆనారోగ్యం లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్న సంఘటనలు కోకొల్లలు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబొరేటరీల్లోనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు.

ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్న ల్యాబ్ నిర్వాహకులు

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రయివేటు ఆరోగ్య కేంద్రానికి వెళ్తే రోగుల బలహీనతను సొమ్ము చేసుకుంటారు. ధనార్జనే ధ్యేయంగా ఆరోగ్య సమస్య లేకపోయినా లేని పోని అపోహలు తలెత్తేలా అన్ని రకాల రక్తపరీక్షలు చేయించి రోగుల జేబులు ఖాళీ చేయిస్తున్నారు. అందులో వైద్యులకు భారీగా పర్సంటేజీలు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో రక్త పరీక్షకు రూ.500 నుంచి 2వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఒక వైద్యుడి వద్ద చేయించిన రక్త పరీక్షలను మరో డాక్టరు తిరస్కరిస్తారు. మళ్లీ చేయించుకోవాలని సూచిస్తారు. దీంతో రోగి ఆర్థికంగా చితికి పోతున్నాడు. జిల్లాలో ఈ ప్రయివేటు ల్యాబొరేటరీలను అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 6వందలకు పైగా ఈ రక్త పరీక్షా కేంద్రాలున్నాయి. ఎటువంటి అనుమతి లేని పలు రక్తపరీక్షా కేంద్రాలను తనిఖీలు చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

సిండికేట్‌గా ఏర్పడిన నిర్వాహకులు

వ్యాధి నిర్ధారణ కోసం వెళ్తే గతంలో ఒక్కో డయాగ్నోస్టిక్ కేంద్రంలో అక్కడ ఉన్న వైద్య పరికరాల నైపుణ్యతను బట్టి ఈ ధరలు ఉండేవి. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులు తీసుకునే డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రోగులు ఎక్కువగా వెళ్లేవారు. గత మూడు నెలలుగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే రకమైన ఫీజులు తీసుకుంటున్నారు. ఫీజుల వసూలుకు ఒక నిబద్ధత, నియంత్రణ అనేది లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఈ సెంటర్లను నియంత్రించే అధికారం తమకు లేదని వారు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని అడ్డగోలుగా దోస్తున్నారని, నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోగులతో వైద్యుల చెలగాటం...?

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీకి తోడు వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్నారు. తక్కువ ధర ఉన్న సెంటర్లకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాలను రెఫర్ చేసిన వైద్యులు అంగీకరించడం లేదు. రక్త, మూత్ర పరీక్షలు సదరు ప్రయవేటు అసుపత్రికి అనుబంధంగానే ఎక్కువగా నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా డాక్టర్లకు డయాగ్నోస్టిక్ సెంటర్లకు విడదీయరాని కమీషన్ల బంధం ఉందనేది జగమెరిగిన సత్యం. ఫలానా డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కొందరు వైద్యులు రోగులకు ఆర్డర్లు వేస్తుంటారు. వారు చెప్పినట్లు వినక ఇతర సెంటర్లకు వెళ్తే వ్యాధి నిర్ధారణ సరిగా లేదని వంకలు పెట్టడం పరిపాటిగా మారింది. వ్యాధి నిర్ధారణ ఎలా ఉన్నా ఫరావా లేదు.. తమకు కమీషన్లు వస్తే చాలనుకునే వైద్యులు కోకొల్లలు ఉన్నారు.

నియంత్రించే చట్టమే లేదా..?

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విషయమై వారిని అడిగితే తామేమీ చేయలేమనే నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌ఏ చట్టంలో చర్యలు తీసుకోవడానికి ఎలాంటి నిబంధనలూ లేవని చెబుతున్నారు. ఫీజు ఎంత వసూలు చేస్తున్నారనేది కాదని, వసూలు చేస్తున్నది డయాగ్నోస్టిక్ సెంటర్‌లోగాని, ప్రయివేటు దవాఖానల్లోగానీ ప్రదర్శిస్తున్నారా...? లేదా చూడాలని మాత్రమే చట్టంలో ఉందని అధికారులు చెబుతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని బరితెగిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకుల చర్యలను అరికట్టేదెవరని రోగులు ప్రశ్నిస్తున్నారు. అది డయాగ్నోస్టిక్ సెంటర్ అయినా ప్రయివేటు దవాఖానా అయినా అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు ఏంటి...?, వాటి నైపుణ్యత ఏ స్థితిలో ఉంది...?, వాటి ద్వారా నిర్ధారిస్తున్న వ్యాధుల నివేదికల స్థితి ఏంటనేది పరిశీలించి వాటిని బట్టి ఒక నిర్ధిష్టమైన ఫీజులు నిర్ధారించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీ వేస్తే బాగుంటుందని, అలాంటప్పుడే రోగులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

అడ్డగోలుగా దోచుకుంటున్నారు

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. గతంలో కొన్ని సెంటర్లలో ఫీజులు తక్కువ ఉండేవి. ఆయా సెంటర్లలో ఉండే ఎక్విప్‌మెంట్స్‌ను బట్టి ఫీజులు తీసుకునేవారు. చిన్న, పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్ ఏదైనా ఒకే రకమైన ఫీజులు వసూలు చేస్తున్నారు. అసోసియేషన్ పేరుతో నిర్వాహకులంతా సిండికేట్ అయ్యారు. దేనికి ఎంత తీసుకోవాలో నిర్ణయించుకున్నారు. ఇంతకంటే తక్కువ ఫీజు తీసుకుంటే రూ.5 లక్షలు జరిమానా విధించాలని నిబంధన పెట్టుకున్నారు. ఇది పేదల మీద విపరీతమైన ప్రభావం చూపుతోంది. వ్యాధి నిర్ధారణ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఫీజులు నియంత్రించకుంటే పేదలు తమ రోగాలకే ఉన్నదంతా సమర్పించుకోవల్సి వస్తుంది. అప్పుల పాలు కాక తప్పదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డయాగ్నోస్టిక్ సెంటర్ల చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ఇంతియాజ్,
సిపిఎం జిల్లా కార్యదర్శి

సూదిమందు వికటించి వ్యక్తి మృతి

నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఘటన

మృతదేహంతో బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - నార్పల

నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నైట్‌డ్యూటీలో ఉన్న నర్స్ భర్త సూదిమందు వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్యతో పాటు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబందించి మృతుని బంధువులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాలు...

మండల కేంద్రంలోని బేల్దారి కాలనీకి చెందిన కుళ్లాయప్ప (38) గురువారం అర్ధరాత్రి అస్వస్థతకు గురికావటంతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నార్పల ప్రాథమిక వైద్యశాలకు తీసుకుని వచ్చారు. అక్కడ కుళ్లాయప్పకు ఇంజక్షన్ వేశారు. కొద్ది సేపటికే అతను మృతిచెందాడు. వైద్యశాలలో నైట్ డ్యూటీలో ఉన్న నర్సు(ఎఫ్ఎన్ఒ) భర్త ఇంజక్షన్ వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు ఆసుపత్రి ఎదుట ఆందోళకు దిగారు. అయితే ఇంజక్షన్ తానే వేశానని తనకు ఆరోగ్యం బాగా లేకపోతే తన భర్త తోడుగా వచ్చాడని నర్సు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు ఇంజక్షన్ వేశారో తెలుసుకోవడానికి పోలీసులు వైద్యశాలలోని సిసి కెమెరా పుటేజీలను పరిశీలించడానికి ప్రయత్నించగా అవి పనిచేయడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న శింగనమల సిఐ కౌలుట్లయ్య, డాక్టర్ ప్రవీణ్ కుమార్ వైద్య సిబ్బందితో వివరాలు సేకరించారు. మృతినిభార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి : వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మృతిచెందిన నిరుపేద కుళ్లాయప్ప కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు పుల్లప్ప, గంగాధర్ మాట్లాడుతూ కుళ్లాయప్పకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని ఆ పిల్లలను ప్రభుత్వమే రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించాలని డిమాండ్ చేశారు. నార్పల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రలోని జరిగిన సంఘటన పై స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బాధిత కుటుంబంతో ఫోన్లో మాట్లాడారు. కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు పాల్పడిన సిబ్బంది మీద చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వంద రోజుల ప్రణాళికలను నెలాఖరులోపు పూర్తి చేయాలి

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ టిఎస్.చేతన్, అధికారులు

స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు సంబంధించిన జిల్లా, మండల కార్యాచరణ ప్రణాళికలను ఈ నెలాఖరు లోపు రూపొందించాలని కలెక్టరు టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. వంద రోజుల ప్రణాళికలు, వివిధ అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లా డుతూ వంద రోజుల ప్రణాళిక లక్ష్యాన్ని ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. వచ్చే ఐదేళ్లకు విజన్ ప్లాన్ నివేదికను సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, మానవ వనరులు, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, తదితర వాటిపై దృష్టి పెట్టి ప్రణాళికలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ ఏడాది 15 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మడకశిర పర్యటనలో సిఎం చంద్రబాబు దృష్టికి వచ్చిన అర్జీలను త్వరగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సిపిఒ విజయకుమార్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, హౌసింగ్ పిడి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీ పార్థసారథి, తదితరులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

బ్యుటీషియన్, పార్లర్ మేనేజ్‌మెంట్ శిక్షణ ముగింపు సమావేశంలో ఎంపీ

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీ పార్థసారథి అన్నారు. త్రిపుర రిసార్ట్ యాజమాని డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటిషన్, పార్లర్ మేనేజ్మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి, జిఎం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బ్యూటిషన్ పై మహిళలు ఎక్కువ మక్కువ చూపిస్తారని ఆ రంగంలో శిక్షణ పూర్తి చేసుకోవడం శుభ పరిణామం అని అన్నారు. కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలను త్రిపుర రిసార్ట్ యజమాని గోపీనాథ్ నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే ఇలాంటి శిక్షణ అందించడం గొప్ప విషయం అన్నారు. చెన్నై నుంచి వచ్చిన కరుణ ఈ బ్యూటిషన్ కోర్సు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, అంగడి రామాంజనేయులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ బోర్డులకు అనుమతి తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ఫ్లెక్సీ బోర్డుల ఏర్పాటుకు అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పుట్టపర్తి పురపాలక సంఘం పరిధిలోని రోడ్లు, వీధుల్లో ఫ్లెక్సీ బోర్డులు, బ్యానర్లు పెట్టదలచినవారు ముందస్తుగా పురపాలక సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అవసరమైన అనుమతులు పొంది చలానా కట్టిన తర్వాత మాత్రమే ఫ్లెక్సీలు, బోర్డులు, బ్యానర్లు పెట్టాలన్నారు. అనుమతులు లేని ఫ్లెక్సీలు, బోర్డులను ముందస్తు సమాచారం లేకుండా తొలగిస్తామని తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ గురువారం గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ శంకర్‌నారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాడకం కనిపిస్తోందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, కావున పట్టణంలో ప్లాస్టిక్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. స్పందించిన కమిషనర్ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

గోరంట్ల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెనుకొండ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని వ్యకాసం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘాల నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ మారుతి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. వారి పోరాట ఫలితంగా విశాఖ ఉక్కు ఏర్పడిందని దీని ద్వారా వేలాది మంది ప్రత్యక్షంగా పరోక్షంగా లబ్ధి పొందుతున్నారని అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయడానికి కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి నాయకులు ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకలను అడ్డుకుంటామని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ ఆంధ్రులకు బహుమతిగా ఇస్తామని నమ్మబలికారన్నారు. ఇప్పుడు ఈ విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించ లేకపోవడం బాధాకరమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడమంటే వ్యవసాయ కూలీలను, రైతాంగాన్ని మోసం చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నర్సంపల్లి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం కన్వీనర్ కొండ వెంకటేశులు కెవిపిఎస్ మండల నాయకులు ముత్యాలప్ప, ఆంజనేయులు, నంజుండప్ప, రత్నమ్మ, రవి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు,వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆసంఘాల నాయకులు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రుల హక్కు అని అన్నారు. కర్మాగారాన్ని ప్రయివేటు పరం చేయడం అంటే వ్యవసాయ కూలీలను రైతాంగాన్ని మోసం చేయడమే అన్నారు. అందుకు నిరసనగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, బాబావలి, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 872.8 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 872.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో గురువారం పుట్టపర్తి మండలంలో సాహెబ్ చెరువు మరవ పారగా, చెక్ డాములు నిండి పొర్లుతున్నాయి. జిల్లాలో 32 మండలాలకు గాను అమరాపురం, బత్తలపల్లి, మండలాల్లో వర్షం కురవలేదు. మిగతా 30 మండలాల్లో ఒక మోస్తారు వర్షం పడింది. అత్యధికంగా చెన్నె కొత్తపల్లిలో 82.4 మిల్లీమీటర్లు, అతి తక్కువగా అమడగూరులో 3.6 మీ.మీ వర్షపాతం నమోదయింది.

పింఛన్ల పంపిణీలో 'పురం' ప్రథమస్థానం

హిందూపురం : సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో హిందూపురం మున్సిపాలిటీ శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. పింఛన్ల పంపిణీలో అంకితభావంతో పనిచేసిన సచివాలయ కార్యదర్శులను గురువారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అభినందించారు.

పోలీసులకు బెనిఫిట్స్ త్వరగా అందాలి : ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉద్యోగ విరమణ పొందిన, మృతి చెందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్, బకాయిలు త్వరగా వారికి అందేలా చూడాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో గురువారం డిపిఒ సిబ్బంది, అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారికి, మృతి చెందిన వారికి ఏమేమి బెనిఫిట్స్, బకాయిలు రావాలి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, వాటితో పాటు ఏమేమి సమస్యలు ఉన్నాయి అని సిబ్బంది ద్వారా ఆరా తీశారు. డిపిఒ, ఎవరెవరు ఏమేమి విధులు నిర్వహిస్తున్నారు. వారి విధుల గురించి తెలుసుకున్నారు. అలాగే అసోసియేషన్ సభ్యుల ద్వారా పోలీస్ వెల్ఫేర్ ఫండ్, సంక్షేమంపై చర్చించారు. అందరూ ఒక టీం వర్క్‌గా చేయాలని సూచించారు. సమావేశంలో ఏవో సుజాత, సూపరింటెండెంట్‌లు సరస్వతి, మల్లికార్జున, సీసీలు రాఘవేంద్ర, ఆనంద్, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఎఆర్ ఎస్ఐ షౌకత్ అలీ, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ అధికారులు

జిల్లా ఎస్పీ వి.రత్నను గురువారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ గోవింద నాయక్, ఎఈ ఎస్ నరసింహులు, సిఐ నాగరాజు, ఎస్ఐ ఉమా మనోహర్ రాజు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మద్యం అక్రమ రవాణాను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచి మద్యం అక్రమంగా జిల్లాలోకి రావాణా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో దసరా జరుపుకోండి : ఎస్పీ

జిల్లా ప్రజలు విజయ దశమి పండుగను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ వి.రత్న విజ్ఞప్తి చేశారు. దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు చేపట్టారన్నారు. నవరాత్రులు పూర్తయ్యే వరకూ డీజేలు, డ్యాన్సులు, బాణసంచా, ఊరేగింపులు పూర్తిగా నిషేధమని వెల్లడించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనాభా ప్రాతిపదికన మద్యం షాపులు

11న లాటరీ విధానంలో కేటాయింపు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాలు కేటాయించినట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాలు ఉన్నాయన్నారు. హిందూపురం అర్బన్ ప్రాంతానికి 6 మద్యం దుకాణాలను కేటాయించినటుల తెలిపారు. అలాగే హిందూపురం రూరల్ మండలానికి 1, లేపాక్షి-1, చిలమత్తూరు-1, పరిగి-2 మొత్తం 11 దుకాణాలు మంజూరైనట్లు తెలిపారు. ఆయా మద్యం దుకాణాలు 2011 జనాభా లెక్కల ప్రకారం మంజూరైనట్లు తెలిపారు. కాగా హిందూపురం పట్టణం, రూరల్, చిలమత్తూరు, పరిగి మద్యం దుకాణాలకు రూ. 65 లక్షలు, లేపాక్షి మద్యం దుకాణానికి రూ. 55 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. దుకాణాల కోసం అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించేందుకు హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 3 టెండర్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తారన్నారు. 10వ తేదీ దరఖాస్తుల పరిశీలన, 11వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో లాటరీ పద్ధతిన మద్యం దుకాణాల కేటాయిస్తారన్నారు.

ధర్మవరం ఎంపిడిఓగా సాయి మనోహర్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం నూతన ఎంపిడిఒగా గురువారం సాయిమనోహర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఉద్యోగి విధులను బాధ్యత, సేవా భావంతో నిర్వర్తించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెళ్లి గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు, తదితర సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఉపాధి హామీ, హార్టికల్చర్, తదితర అంశాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రతి వ్యక్తికి విద్య, వైద్యం, ఉపాధి అందేలా కృషి చేస్తానన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్‌నబి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపిడిఒకు టిడిపి నాయకుల శుభాకాంక్షలు

నూతన ఎంపిడిఒ సాయి మనోహర్‌ను రూరల్ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ రూరల్ ఇన్‌ఛార్జి మహేష్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి విజయ్‌సారథి, జంగం నరసింహులు, ఎ.వెంకటరమణ, భాస్కర్‌చౌదరి, చంద్ర, గుత్త సూరి, ఎం.రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేష్

రెవెన్యూ డివిజన్‌లోని ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా విధులు నిర్వహించాలని ఆర్డీవో ఎ.మహేష్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో గురువారం ధర్మవరం, ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమయపాలన విధిగా పాటించాలని, ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డిఎఒ ఖతిజున్ కుఫ్రా, ఎఎస్ఒ లక్ష్మీదేవి, డిటి హంపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీవోకు నాయకుల శుభాకాంక్షలు

నూతన ఆర్డీవో మహేష్‌ను నియోజకవర్గ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియచేసారు. నాయకులు నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, నాయకులు రాళ్లపల్లి షరీఫ్, నాగూర్ హుస్సేన్, కత్తుల బాబ్జి, మాధవరెడ్డి, చింతలపల్లి మహేష్, కేశగాళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఆర్డీవోగా వెంకటసన్యాసిశర్మ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నూతన ఆర్డీవోగా వెంకట సన్యాసి శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సన్నీవంశీకృష్ణ బదిలీపై కావలికి వెళ్లారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న సన్యాసిశర్మ ఇక్కడికి వచ్చారు. నూతన ఆర్డీవోకు పలువురు రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బత్తలపల్లి ఎంపిడిఓగా నరసింహనాయుడు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల నూతన ఎంపిడిఒగా నరసింహనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సాయి మనోహర్ బదిలీపై ధర్మవరం వెళ్లగా, లేపాక్షిలో పని చేస్తున్న నరసింహనాయుడు ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎంపిడిఒను నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, సంగాల సూరి, జక్కంపూడి నాగభూషణం, సుబ్బరాయుడు, రామానాయుడు, ఓబుళనాయుడు, తదితరులు కలిసి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మడకశిర తహశీల్దార్‌గా కరుణాకర్

ప్రజాశక్తి-మడకశిర

తహశీల్దార్ కరుణాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మండల నూతన తహశీల్దార్‌గా గురువారం కరుణాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకటేష్ బదిలీపై హిందూపురం వెళ్లగా గుడిబండలో పని చేస్తున్న కరుణాకర్ ఇక్కడికి వచ్చారు. నూతన తహశీల్దార్ కరుణాకర్‌ను రేషన్ డీలర్లు పూలమాలలతో సన్మానించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గోరంట్ల ఎంపిడిఓగా నరేంద్రకుమార్

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నూతన ఎంపిడిఒగా నరేంద్రకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈయన హిందూ పురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా నల్లచెరువు మండలానికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రమీల, సూపరింటెండెంట్ నార్యానారాయణ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రైతులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో లోకేశ్వర్‌రెడ్డి వివిధ పంటల సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం వేరుశనగ, వరి పొలాలను సందర్శించి ఆయా పంటల్లో పాటించా ల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలానాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆయా శాఖలకు సంబంధించి అమలు చేస్తున్న పథకాలు, పాటించాల్సిన యాజ మాన్య పద్ధతుల ను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీరాములు, గ్రామ వ్యవసాయ సహాయకు లతో పాటు సంబంధిత ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : వరి సాగులో తెగుళ్లపై ఎడిఎ జిల్లా వనరుల కేంద్రం డిఆర్‌సి సనావుల్లా, ఏవో ఎస్.అబ్దుల్‌అలీ రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని డబురువారిపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన వరి, టమోటా పంటలను అధికారులు పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్‌అహ్మద్, పట్టు పరిశ్రమ శాఖ ఎడిఎ కె.గీత, ఎస్ఒ శ్రీనివాస్‌రెడ్డి, ఎఇఒ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

ధర్మవరం రూరల్ : మండలంలోని చింతలపల్లి, వసంతపురం గ్రామాల్లో ఏవో ముస్తఫా ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు వరి, కంది పొలాలను పరిశీలించి పంట దిగుబడి, తెగుళ్ల నివారణ, తదితర అంశాలపై రైతులకు సలహాలు ఇచ్చారు. జీవామృతం తయారీ విధానాన్ని చేసి చూపించారు. పట్టు పరిశ్రమ అధికారి దామోదర్‌రెడ్డి పట్టు సాగు వల్ల ఉపయోగాలు, వివిధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారి శేఖర్, సిరికల్చర్ అధికారి దామోదర్‌రెడ్డి, బాబయ్య, ఎఇఒ అశ్విని, ఎంపిఇఒ స్వాతి, పాల్గొన్నారు.

సాళువ పాలకుల శాసనం పరిశీలన

ప్రజాశక్తి-గోరంట్ల

విజయనగర(హంపి) సామ్రాజ్యాన్ని పాలించిన రెండో రాజవంశం 'సాళువ' పాలకులు చాళుక్య వంశ వారసులనే సరికొత్త చారిత్రక అంశాన్ని చరిత్రకారుడు మైనాస్వామి ప్రకటించారు. గోరంట్ల మాధవరాయలు ఆలయ ముందు ఉన్న రాతి పలక శాసనం ఆ విషయాన్ని వెల్లడిస్తుందని మైనాస్వామి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గోరంట్ల మాధవరాయస్వామి 'అంగరంగ వైభోగ' సేవలకు భూదానం ఇస్తూ శాసనాన్ని సాళువ నరసింగరాయలు రాయించాడన్నారు. శక వర్షం జయ నామ సంవత్సరం మాఘ మాసం. ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం సామాన్య శకం 1474. చంద్రగిరి సీమకు పాలకునిగా ఉన్న సాళువ నరసింహరాయలును నాటి రాజ్య ప్రభువు రెండో విరూపాక్ష రాయలు(సంగమ వంశం) పెనుకొండ సీమకు రాజప్రతినిధిగా నియమించారు. తాము యదు వంశానికి చెందిన వారమని, చాళుక్య వంశ వారసులమని సాళువ నరసింగరాయలు శాసనంలో చెప్పినట్టు మైనాస్వామి తెలిపారు. బిజ్జలరాయ, మంగి దేవ భూపతి వంటి సాళువ పూర్వీకుల పేర్లు శాసనంలో ఉన్నాయన్నారు. శాసనకర్త పేరు 'శ్రీమాన్ నరసింగ భూపతి రాయ' అని ఉండగా మేదిని మీసర గండ, కఠారి వంటి బిరుదులు ఉన్నాయన్నారు. తొలుత చంద్రగిరి, తర్వాత పెనుకొండ సీమ రాజ ప్రతినిధిగా పని చేసిన సాళువ 1485 నుంచి 1491 వరకూ విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా పాలించినట్లు వివరించారు. సాళువ వారు చాళుక్య వంశస్థులేనని చరిత్ర పుస్తకాల్లో సరికొత్తగా లిఖించాలని చరిత్రకారుడు మైనాస్వామి కోరారు.

శాసనాన్ని పరిశీలిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

కల్తీ కల్లు విక్రయాలు అరికట్టాలి

ప్రజాశక్తి - హిందూపురం

కల్తీకల్లు విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎపి ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ కర్నాటక సరిహద్దులోని చౌళూరు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కల్తీకల్లు విక్రయాలు సాగుతున్నాయని తెలిపారు. కల్లులో విషపూరిత పదార్థాలు వేసి సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. బాటిల్ కల్లు రూ. 40 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గీత కార్మికులకు 2003లో ఇచ్చిన 24.47 భూమిని కూడా అన్యాక్రాంతం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు దీనిపై వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అన్ని ప్రజాసంఘాలు, పార్టీలను కలుపుకొని కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సమైక్య అధ్యక్షులు నారాయణ, బీఎస్పీ నాయకులు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు అనిల్, పురుషోత్తం, లోకేష్,అశోక్, నిఖిల్, రామాంజి, తిప్పన్న, నౌషాద్, ఆర్‌సిపి నాయకులు ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

గోరంట్లను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గోరంట్లను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ కూటమి నాయకులు గురువారం పట్టణంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిని, పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాలేదన్నారు. మండలంలోని రైతులు, రైతు కూలీలను దృష్టిలో ఉంచుకొని గోరంట్లను కరువు మండలంగా ప్రకటించి వలసలను నివారించాలని కోరారు.

గోరంట్ల : మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం చాలా తక్కువగా నమోదైందని, కావున గోరంట్లను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ మారుతికి వినత పత్రం అందజేశారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంట సాగు చేసినా సరైన సమయంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో పెట్టుబడి కూడా అందే పరిస్థితి లేదన్నారు. అధికారులకు వినతి ఇచ్చిన వారిలో కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణచౌదరి, అజంతుల్లా, సుధాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బోర్ల అశ్వర్థరెడ్డి, నిమ్మల శ్రీధర్, రాఘవ నాయుడు, కమ్మవారిపల్లి వెంకటేష్, ఉత్తమరెడ్డి, సుబ్రహ్మణ్యం, బొబ్బిలి రామ్మోహన్, గంగాధర్‌నాయక్, సోమశేఖర్, నరసింహులు, వేణు రాయల్, సర్పంచి నరసింహమూర్తి, నిమ్మల శ్రీధర్, పసుపులేటి శ్రీనివాసులు, రాజారెడ్డి, పుల్లేరు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

జెసి అభిషేక్‌కుమార్‌కు వినతి ఇస్తున్న కూటమి నాయకులు

గంగినేపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని గంగినేపల్లి సచివాలయంలో గురువారం డాక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గంగినేపల్లి సబ్ సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది గ్రామంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవన్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీప హెల్త్ సెంటర్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని, ఇళ్లల్లో వేపాకుతో పొగ పెట్టుకోవాలన్నారు. నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచవద్దన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఐశ్వర్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపిపి చంద్రశేఖర్ మృతికి సంతాపం

రొద్దం : రొద్దం మండల ఎంపిపి చంద్రశేఖర్ మృతికి గురువారం పలు వురు సంతాపం తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విషయం తెలిసిన వెంటనే ఎంపి బికె.పార్థసారధి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వైసిపి నాయకులు చరణ్‌రెడ్డి, మాజీ మంత్రి శంకర నారాయణ, వివిధ పార్టీల నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కదిరి టౌన్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. పట్టణంలోని 29వ వార్డులో గురువారం ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, నాయుడు, దాదాపీర్, సిరాజ్, ఖాదర్‌బాషా, మహమ్మద్‌బాషా, సచివాలయ సిబ్బంది విజయ్ కీర్తి, సాయిఅశ్విని, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కదిరి టౌన్ : ఆర్టీసీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఈఎఫ్ జైభీమ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ తెలిపారు. కదిరి ఆర్టీసీ డిపోలోని జై భీమ్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. నాగేంద్రనాథ్ మాట్లాడుతూ కదిరి డిపోలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పై ఎంఈఎఫ్ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి పోరాడితే విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జి.నాయక్, విశ్వనాథ్, గంగాద్రి, గంగరాజు, జిఎన్.స్వామి రమణప్ప పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం లాభదాయకం

మడకశిర : పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని టెక్నికల్ అసిస్టెంట్ మారేగౌడ్ తెలిపారు. రొళ్ల మండలంలోని ఎం.రాయపురం పంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ భూముల్లో మేలు రకాలైన పండ్ల తోటలను పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు నారాయణప్ప, చంద్రప్ప, రామకృష్ణ, తరుణ్, మణికంఠ, రంగనాథ్, కర్రెన్న, దేవరాజు పాల్గొన్నారు.

5న ఉచిత వైద్య శిబిరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్ ఆవరణలో బెంగళూరులోని వైదేహి హాస్పిటల్ యాజమాన్యం సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కందికుంట ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. అక్టోబర్ 5వ తేదీ ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా బాలికల జడ్పీ హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తామని నాగేష్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణ సమీపంలోని బ్లూమూన్ ఇనిస్టిట్యూట్‌లో అటవీ శాఖ అధికారులు 'వన్యప్రాణులు-సంరక్షణ' అంశంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుర్రప్ప మాట్లాడుతూ అడవులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలో ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని, వన్య ప్రాణులను సంరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.రామచంద్రనాయక్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు జి.రామచంద్రారెడ్డి, డి.దామోదర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు టిడిపి నాయకుల సన్మానం

ప్రజాశక్తి-తలుపుల

నూతన తహశీల్దార్ రెడ్డి శేఖర్‌ను గురువారం టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, ఎద్దుల సిద్దయ్య, పార్థసారధి, వీరభార్గవ్‌రెడ్డి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి-లేపాక్షి

బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు స్థానిక కెజిబివి ప్రహరీ కూలిపోయిందని ప్రిన్సిపల్ నీలిమ తెలిపారు. పాఠశాలకు సెలవులు కావడంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

నీట మునిగిన వరి పంట

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. మండలంలోని లక్కసానిపల్లి వద్ద వరిమడి, మిరప, మొక్కజొన్న, తదితర పంటలు నీట మునిగినట్లు బాధిత రైతులు వాపోయారు. పలు గ్రామాల్లో నీరు చేరి పత్తి పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వరి పొలంలోకి చేరిన వర్షం నీరు

సహజవాయువు సరఫరాతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ జె రత్నాకర్

జిల్లాలో మొదటిసారిగా సహజ వాయువు సరఫరా యూనిట్ ఏర్పాటు చేయడం శుభపరిణామం అని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ తెలిపారు. పట్టణ సమీపంలోని మామిళ్లకుంట క్రాస్‌లో ఏర్పాటుచేసిన నేచురల్ గ్యాస్ నిల్వ కేంద్రాన్ని గురువారం రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్యాస్ కంపెనీ ఏజీ అండ్ పి ప్రథమ్ సంస్థ నిర్వాహకులతో పాటు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ వి.రత్న పాల్గొన్నారు. ప్రథమ్ సంస్థ యూనిట్ రీజినల్ హెడ్ చిరాగ్ పటేల్ మాట్లాడుతూ పర్యావరణ అనుకూల వ్యవస్థపై ప్రపంచం అధికంగా దృష్టి పెడుతున్న నేపథ్యంలో పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించాల్సి వస్తుందన్నారు. రత్నాకర్ మాట్లాడుతూ మానవాళికి విభిన్న ప్రయోజనాలు కలిగించే సహజవాయువును వినియోగంలోకి తీసుకొచ్చిన ప్రథమ్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ బృందం చిరదీప్ దత్త, సుశీల్‌జాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమావేశమైన మున్సిపల్ యూనియన్ నాయకులు

పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం జిల్లా మున్సిపల్ యూనియన్ సంఘం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, వాహనాలకు మరమ్మతులు చేయించాలని, దహన సంస్కరణ మట్టి ఖర్చులకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుడు సాధారణంగా చనిపోతే ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రిటైర్మెంట్ వారికి రూ. 75 వేలు ఇవ్వాలని, తదితర విషయాలపై చర్చించారు. స్థానిక సమస్యలపై ఈ నెల 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా మున్సిపల్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ వర్కర్స్ నాయకులు జగదీష్, మల్లికార్జున, తిరుపాలు, వెంకటేష్, బాబు, నాగార్జున, నరసింహులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : డీఎస్పీ

హిందూపురం : శాంతియుత వాతావరణంలో దసరా ఉత్సవాలు జరుపుకోవాలని హిందూపురం డీఎస్పీ మహేష్ సూచించారు. దసరా ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆయన గురువారం పలు సూచనలు చేశారు. పాత పద్ధతిలోనే దసరా వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. కొత్తగా అమ్మవారి విగ్రహాల ఏర్పాటుకు ఎక్కడా, ఎవరికీ అనుమతి లేదన్నారు. అదేవిధంగా డీజేలు, డ్యాన్సులు, బాణాసంచా, నిమజ్జనం ఊరేగింపులు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనువాద దిగ్గజం వెంకటరెడ్డి

హిందూపురం : తెలుగు భాష నుండి వందల సంఖ్యలో పుస్తకాలను హిందీ భాషలోకి అనువదించి పేరు ప్రఖ్యాతలు గడించిన అనువాద దిగ్గజం వెంకటరెడ్డి అని వక్తలు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో హిందూపురంలోని తపన సాహితి వేదిక కార్యాలయంలో వెంకటరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ యనమల చిన్నయ్యగారి పెద్ద వెంకటరెడ్డి లేని లోటు సాహితీ లోకానికి తీరని నష్టం అన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా గౌరవాధ్యక్షులు, తపన సాహితీ వేదిక వ్యవస్థాపకులు సడ్లపల్లె చిదంబర రెడ్డి, కల్లూరు రాఘవేంద్ర రావు, అరసం జిల్లా అధ్యక్షులు సిద్ధగిరి శ్రీనివాస్, గౌరవ సలహాదారు శౌంఠి జయప్రకాష్, కార్యదర్శి గంగాధర్, ఉపాధ్యక్షులు ఏటిగడ్డ అశ్వర్థ నారాయణ, వెంకట రమణ, షహీన, ఎంసి.గంగాధర్, కాలవ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో వాల్మీకి కళ్యాణ మండపానికి భూమిపూజ

పరిగి : మండల కేంద్రమైన పరిగిలో వాల్మీకి కళ్యాణ మండపానికి గురువారం ఎంపి బికె.పార్థసారధి భూమిపూజ చేశారు. ముందుగా ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి కళ్యాణ మండపం భూమి పూజ కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ పరిగిలో వాల్మీకి కళ్యాణ మండపం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. వాల్మీకి కళ్యాణ మండపానికి ఎంపి నిధి నుంచి రూ. కోటి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మడకశిర

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి బిసి సాధికారిక కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప తెలిపారు. రొళ్ల మండలంలోని హొట్టెబెట్ట గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని పంచాయతీ అభివృద్ధి, జరగాల్సిన పనుల గురించి ప్రజలకు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, ఎంపిడిఒ ప్రసాద్, ఎపిఒ ఓబుళప్ప, జికె.ఈరన్న, ఆనంద్ , రవి, భరత్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

కదిరి టౌన్ : పట్టణంలోని హిందూపురం క్రాస్ నుంచి కోనేరు సర్కిల్ వరకూ రహదారి గుంతలమయమై ప్రజలు, వాహన చోదకులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవ తీసుకుని మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులను అక్కడికి పిలిపించి ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ కృష్ణమోహన్ నాయుడు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు టిడిపి నాయకుల సన్మానం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహశీల్దార్ మారుతిని మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు, పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి దేవా, నరసింహప్ప, గంగిరెడ్డి, ప్రభాకర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రొద్దం : మండలంలోని తాడంగిపల్లి గ్రామానికి చెందిన గంగాధర్(48) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్ రోడ్డులో గురువారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో నలుగురు గాయపడగా, 50 బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం నుంచి బ్రాయిలర్ కోళ్లను అనంతపురం తీసుకెళ్తున్న లగేజీ వ్యాన్ గురువారం తెల్లవారుజామున ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాంద్ బాషా, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానికులు వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. 50 కోళ్లు మృతి చెందాయి. అలాగే పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లికి చెందిన రామాంజనేయులు కారులో అనంతపురం మండలంలోని మన్నీల గ్రామానికి వెళ్తుండగా అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రామాంజనేయులుతో పాటు డ్రైవర్ అరుణ్‌కుమార్ కారులో ఇరుక్కుపోగా స్థానికులు, పోలీసులు వారిని బయటకు తీసి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.